# నాలుగు కొమ్ముల మృగం



"బాగున్నావా"?

ఆ ప్రశ్నకి పార్కులో ఓమూల ప్రశాంతంగా కూర్చుని శూన్యంలోకి చూస్తున్న శాంత మెల్లగా తలతిప్పిచూసింది.

ఎదురుగా అతను-

ముందు సాధారణంగానే చూసిన ఆమె కళ్ళు ఆశ్చర్యాన్ని నింపుకుని అలానే నిల్చిపోయాయి.

"చాలా రోజులకి కలుసుకున్నాం కదూ!" ఆమె గొంతు పెగలింది.

"ఏంమొహం పెట్టుకు కలవమన్నావ్?" అతని ప్రశ్న-

మౌనంగా చూసి, కాస్త సర్దుకుకూర్చుందామె.

"శాంతా! ఎంత దూరమైపోయినా నేను నీ యోగక్షేమాలు విచారిస్తూ ఉన్నాను. నువ్వు రోజురోజుకీ మరీ ఎందుకిలా మౌనముద్రలోకి జారిపోతున్నావో అర్థంకావట్లేదు. అందుకే నువ్వేమనుకున్నా సరేనని నీకెదురుపడ్డాను"

చివుక్కుమందామెకి. అప్రయత్నంగా ఆమె చూపులు అతని కళ్ళల్లో పొడిచాయి. ఆ వెనుక వచ్చిన వెచ్చటి నీటిపొరలు కళ్ళని మండించాయి.

"అసలేం చేద్దామనుకుంటున్నావ్?" అతని గొంతు ఆమె పట్ల ఆర్ద్రత ప్రకటిస్తోంది.

"ఏంచేయమంటావ్?" ఆమె అతన్ని అలా ఎదురు ప్రశ్నించడం అదే మొదటిసారి.

గతంలోకి తొంగిచూస్తే ఆమె మనసు స్వాధీనం తప్పుతుందని అతను గ్రహించలేక పోయాడు వెర్రిగా ఆమెనే చూస్తున్నాడు.

"అందరూ నన్ను అదోలా చూస్తున్నారు సత్యం. నేను వంటరిదాన్ని. ఇప్పటికే నాకు పెళ్ళీడు దాటిపోతోంది. నాపై పడే అందరి చూపులే నాకో శిక్ష. నువ్వు మళ్ళీ యిలా- మును పటి సత్యంలానేవచ్చి అందరికీ నాపై ఉన్న అనుమానాల్ని నిజంఅనుకునేలాచేయకు-ప్లీజ్' అతన్ని ఎవాయిడ్ చేయాలని ఆమె ఉద్దేశం.

అతనికి ఆమె మాటలు 'ఏదో'లా అనిపించాయి.

"పొమ్మని డైరెక్టుగా చెప్పచ్చుగా...."

"వెళితే మంచిదంటున్నాను"

"ఎవరికి?"

"ఇద్దరికీనూ...."

"నా మంచిగురించి కాదు. నీ మంచిగురించే ఆలోచిస్తున్నాను"

"దానికో అర్హత ఉంటుంది సత్యం!"

"శాంతా నువ్వు చెప్పదల్చుకున్నదేవిటి?"

"నువే. చెప్పాలనుకుని ఇన్నాళ్ళ తర్వాత వచ్చావ్?"

"పెళ్ళి చేసుకోమని...."

"ఎవర్ని?"

"మంచోణ్ణిచూసి-"

"చూస్తేనే మంచోడని తెలిసిపోతుందా? ఏమోమరి నాకు కొన్నేళ్ళ స్నేహంలోకూడా తెలీలేదు"

శాంతా! నన్ను ఇంకా దుర్మార్గుడిగానే భావిస్తున్నావ్ కదూ శాంతా నేను ఏంచేసినా చివరికి.... వేరే అమ్మాయిని పెళ్ళిచేసుకున్నా- నీకు చెప్పేచేశాను...."

"ఉరిశిక్ష విధించేముందుకూడా నిందితుడికి 'నీకు ఉరివేస్తున్నాం' అని చెప్పే విధిస్తారు సత్యం...."

మౌనంగాలేచి పార్కుబయటికి నడిచాడతను. అప్పటివరకూ మొండితనాన్నే పట్టిన ఆమె గొంతు పూగగానే 'సత్యా.... సత్యా....' అంటూ రోదిస్తోంది- వెళ్ళిపోతున్న తన నాటి ప్రియతముని చూస్తూ.

'అతన్ని అర్థంచేసుకోలేక పోయానేమో'ననే ఫీలింగ్ ఆమె హృదయాంతరాలలో.... ఎక్కడో....

గతంలో శాంత, సత్యం ప్రేమించుకున్నారు-

ఆ తర్వాత పెద్దల అనంగీకారంవల్ల విడిపోవడమూ జరిగింది- దాంతో శాంతకి పెళ్ళిమీదే విరక్తికలిగింది. తల్లి, తండ్రులు అకాల మృత్యువాత పడ్డాక, సౌఖ్యంమీదకూడా పూర్తి ఏవగింపే కలిగిందామెకి, ఫలితంగా యాంత్రికమైన జీవితాన్ని గడుపుతోంది శాంత.

శాంతకి ఈ మధ్యనే ఒకమంచి ఉద్యోగం వచ్చింది. అదే ఆఫీసులో పనిచేస్తున్నాడు సత్యం.

మరికొన్నాళ్ళకి- కొలీగ్స్‌గాకూడా మరింత చనువు మళ్ళీపెరిగాక ఓరోజు ఆమె దగ్గరికి

వచ్చాడు సత్యం-

"శాంతా నామీద నీకు ఏమాత్రం అభిమాన మున్నా- నేనోమాట చెప్తాను"

"విషయం చెప్పు సత్యం!"

"నేన్నీకో సంబంధంతెచ్చాను"

"........"

"అబ్బాయిది మంచి ఉద్యోగం.... పోతే... ఒకకాలు.... కొంచెం.... మరో చిన్నవిషయం ....అతనికీమధ్యే పెళ్ళయింది.... కారణాలు తెలియవుగానీ ఆమె ఆత్మహత్య.... చేసుకుందిట.... అబ్బాయి మాత్రం చాలా మంచివాడు...."

అతని గొంతుక్కి ఆమె వెక్కిళ్ళు అడ్డొచ్చాయ్-

రెండురోజులు సెలవుపెట్టేసి ఇంటికెళ్ళిపోయింది శాంత-

మర్నాడు సత్యం ఆమె దగ్గరకెళ్ళాడు-

అతను వెళ్ళేసరికి ఆమె పిచ్చిదాన్లా దిక్కులు చూస్తూ కూర్చుంది.

"నన్ను క్షమించు శాంతా!"

"సత్యం....!" మళ్ళీ బావురుమందామె-

"నీకు పెళ్ళికావడంలేదనే నాబాధ...."

"సత్యం! నాకు దూరమైపోయినా - నా మంచినే కోరుకొనే నీ చల్లని స్నేహం చాలు- నీవంటి స్నేహితుని దగ్గర ఒక్కింత ఓదార్పు చాలు సత్యం.... చాలు

ఆమె మనసులో అతనిపై గౌరవం మరింతయ్యింది.

"శాంతా-" ఆమె తలని రెండు అరచేతుల్లోకి తీసుకుని- సూటిగా కళ్ళల్లోకి చూస్తూ, "శాంతా చివరిగా మరోమాట అడగనా?" అన్నాడు ఏమిటన్నట్లు చూసింది.

నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను-" అన్నాడు.

ఉలిక్కిపడింది... తటిల్లతలా భయంతో వణికిపోయింది. తను నిల్చున్నంత మేర భూమి పగిలిపోయి, అగాధాల్లోకి కూరుకుపోతున్నట్లు.... తనపై పముల వందలపిడుగులు ఒక్కుమ్మడిగా పడ్తున్నట్టు.... ఏదో అదృశ్యహస్తం తన కంఠనాళాలు తెగతెంపటానికి కంకణం కట్టుకుని తనపైకి వచ్చేస్తున్నట్లు....

అతనివైపు ఆందోళనగా చూసింది-

ఒక్కక్షణం ఆమె కళ్ళముందునుంచి సత్యం అదృశ్యమైపోయి- అతనిస్థానంలో ఒక ఎలుగుబంటి ఆకారంలోవున్న ఒక జంతువు, తలమీద నాలుగు కొమ్ములతో, నోటినుండి తొంగిచూసే విషపుకోరలతో.. చేతిలో పూలహారం పట్టుకుని తనవైపు వస్తున్నట్లుగా తోచింది-

"ఏం? మాట్లాడవేం శాంతా?" అడిగాడతను.

అంతకు రెండురోజుల క్రితమే అతను తన భార్యని రెండోసారి పురిటికి పంపించాడు.

శాంత పేలవంగా నవ్వింది-

"సత్యం నీ సానుభూతి మాటలు, నువ్వు ఒలికించే ప్రేమ సూక్తులు-, ఇవన్నీ వింటూ వుంటే నాకేమనిపిస్తుందో తెలుసా సత్యం?" అంది ఆదోలాచూస్తూ....

వర్తమాన జీవితంపై అతను కలిగించిన భయాలు-

గతానికి అతను చెక్కిన నగిషీలు

భవిష్యత్తుకి అతను వేస్తున్న విద్యుత్ సోపానాలు-

అన్నీ అతని చూపుల్లో కదం తొక్కుతుండగా,

"ఏమనిపిస్తోంది?" ఆతృతగా అడిగాడు.

"నాకే గనుక ప్రభుత్వం కిల్లింగ్ లైసెన్సు ఇస్తూ ఒక రివాల్వర్‌ని బహూకరిస్తే.... మరుక్షణం నిన్ను షూట్‌చేసి పారేసేదాన్ని!" అంది రౌద్రంగా -

"శాంతా!"

"షటప్ నీనోటంట 'మరొకమాట వచ్చినా, మళ్ళీ నీ మొహం నాకు కనిపించినా- లైసెన్సు తోనూ, రివాల్వర్‌తోనూ పనిలేకుండా ఆ పని చెయ్యవలసివస్తుంది!" బుసలు కొడ్తున్నట్లు అందామె, కళ్ళుమూసుకుని ఆవేశాన్ని దిగమింగుకుంటూ.

ఆమె కళ్ళు తెరిచేసరికి అతనులేదు.

మళ్ళీ జీవితంలో సత్యం ఆమెకంట పడలేదు- •

-కాదంబరి కిరణ్‌కుమార్



నేను పదవ తరగతి పరీక్షలో ఒక్క సబ్జెక్టులో (ఇంగ్లీష్) చెక్కేస్తాననుకున్నాను. సరిగ్గా అలాగే జరిగింది. మార్కులు ఇన్ని వస్తాయి అనుకున్నాను (గెస్) సరిగ్గా అన్నే వచ్చాయి. ప్రతి సబ్జెక్ట్‌కు ఇన్ని మార్కులు వస్తాయి అని గెస్ చేసాను. సరిగా అన్నే వచ్చాయి. మరి ఇది సిక్త్స్‌సెన్స్ కాదా....

ఇలా ఊహించాను అని ఎవరికి చెప్పినా నమ్మటంలేదు.... మరి స్రవంతి పాఠకులైనా....

-యం ది అతీఖ్ మొహియొద్దీన్, కరీంనగర్

నేను, పుండరీ, కోకిల మంచి స్నేహితులము. కోకిల అందంగా ఉండేది. అందుకని వాళ్ళ బావ కట్నకానుకలు లేకుండానే కోకిలను పెళ్ళి చేసుకొన్నాడు. సంక్రాంతి పండగకి కోకిల పుట్టింటికి వచ్చింది అత్తగారింట్లో దాని కష్టాలు చెప్పుకొని బాధపడింది. ఆ తరువాత పదిరోజులక అత్తగారింటికి వెళ్ళిపోయింది. ఆ రాత్రే నాకు ఒక కల వచ్చింది- కోకిలను వాళ్ళ అత్త - భర్త కలిసి చంపేశారని. పక్క రోజు పుందరికి చెప్పితే తనకుకూడా అలాంటి కలే ఆ రాత్రి వచ్చిందని చెప్పింది. ఇద్దరికి కోకిల చనిపోయినట్టు కలవచ్చినందుకు ఆశ్చర్యం వేసింది. మరికొద్దిసేపటికి కోకిల ఆత్మహత్య చేసుకుందని వచ్చిన వార్తవిని నిర్ఘాంతపోయాము. తరువాత నిజం బయటపడింది. కోకిలను వాళ్ళ అత్త, భర్త చంపేసి కాలువలో పడేసి ఆత్మహత్య అని పుకారు పుట్టించారని. ఇది సిక్త్స్‌సెన్స్ కదూ:

-ఎ. ఉషారాణి, గోరంట్ల

ఆ రోజు స్కూల్లో ప్రైవేటు క్లాసు కండక్ట్ చేశారు. 'నూకరాజు మాష్టారు' ఎందుకో పదే పదే అనిపించసాగింది 'ఆయనచేత దెబ్బతింటానని'. కానీ అలా జరగటానికి అవకాశం ఎంత మాత్రం లేదు అయినా నా సిక్త్స్‌సెన్స్ పోరు మాత్రం ఆగలేదు. క్లాసు పూర్తయిన తర్వాత "క్వార్టర్లీ పేపర్లు దిద్దటం పూర్తయింది చూసుకోండి" అంటూ పేర్లు పిలవసాగారు. ఒక్కొక్కరు వెళ్ళి పేపరందుకున్నారు. 'పి. చక్రరావు' అని పిలిచారు నేను వెళ్ళి పేపరు తీసుకున్నాను. అది నా రైటింగ్ కాదు. "మాష్టారు ఇది నాది కాదండి" అన్నాను. "నీది కాకపోతే ఎందుకొచ్చావ్?" అంటూ గూబగుయ్‌మనిపించారాయన.

అదే క్లాసులో యింకో చక్రరావు ఉన్నాడు. అతని ఇంటిపేరు 'పేరుకాయల', మా ఇంటి పేరు పాట్నేడి. ఈ సంగతి గ్రహించిన మాష్టారు తరువాత నొచ్చుకున్నారనుకోండి.

-పాట్నేడి చక్రిరావు, బురుజుపేట, వైజాగ్

నే కాలేజీ చదివే రోజుల్లో అందరిలానే ఓ అమ్మాయిని ప్రేమించాను. పేరు "పుష్పవల్లి" ప్రతిక్షణం నా ఆలోచనలన్నీ ఆ అమ్మాయి చుట్టూ తిరిగేవి. ఆ అమ్మాయి నా స్వంతం. ఆమెకు నాకు ఏదో రిలేషన్ ఉన్నట్లు ఫీలయ్యేవాడ్ని నా కలలోకూడ ఆ అమ్మాయి తరచూ వచ్చేది, పుష్పవల్లి కాక, నా మేనకోడలిగా, మరదనుగా, భార్యగా, రకరకాలుగా....

ఫైనల్ ఇయర్ పరీక్ష ఫీజ్ కట్టేటప్పుడు, ఆ అమ్మాయి తండ్రి పేరు చూసాను- "బాలకృష్ణ ముదిరాజ్"

తీరాతీస్తే పుష్పవల్లి నాకు స్వయాన మేనమరదలు అని తెల్సింది. రెండు సంవత్సరాలు నేను కలల్లో ఊహించుకొన్న అమ్మాయే నిజంగా నాకు మేనమరదలిగా లభించింది.

-చింతల లక్ష్మణ్ ముదిరాజ్,
జి.పి మార్కెట్. హైదరాబాద్